సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 5 । జూలై । 2024



నేలతల్లి కరుణించేలా..

మట్టి ఎద్దులకు పూజలు చేస్తే నేలతల్లి కరుణిస్తుందని రైతుల నమ్మకం. వర్షాలు కురుస్తాయని నమ్మకం. 10లో▸



అన్ని రంగాల్లో అభివృద్ధి

కొడంగల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. 10లో▸



రైతుభరోసా ఎవరికో?

రైతు భరోసా ఎవరికి? రుణమాఫీకి అర్హులెవరు? అనే దానిపై స్పష్టత లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 11లో▸

చిలుక వాగు ప్రక్షాళన

కబ్జా స్థలం స్వాధీనం దిశగా అడుగులు

- వాగు వెడల్పు 20అడుగులు
- మిగిలింది 5 ఫీట్లే
- ఆక్రమణలను తొలగిస్తున్న అధికార యంత్రాంగం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో పనులు ప్రారంభం



వాగును ఆక్రమించిన వారితో మాట్లాడుతున్న అధికారులు

తాండూరు: ఎట్టకేలకు చిలక వాగు ప్రక్షాళనకు అడుగులు పడ్డాయి. రెవెన్యూ రికార్డుల ఆధారంగా వాగు వెడల్పు ఎంత మేర కబ్జాకు గురైందో గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. గురువారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ప్రారంభమైంది. చిలకవాగు కబ్జాకు గురికావడంతో వరద నీరు ముందుకెళ్లడం లేదు. దీంతో పట్టణ పరిధిలోని సాయిపూర్, గ్రీన్ సిటీ ప్రాంతాలు వరద ముప్పు బారిన పడుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో ఈ వాగు ప్రక్షాళనకు రూ.10కోట్లు మంజూరైనా పనులు సాగలేదు. తాజాగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రూ.16 కోట్లు మంజూరు చేయించి అన్యాక్రాంతమైన వాగును స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

అంతారం చెరువు నుంచి..

తాండూరు మండలం అంతారం చెరువు నుంచి చిలుక వాగు మొదలవుతుంది. చెరువు అలుగు నుంచి వచ్చే నీరంతా ప్రవాహంగా మారి యాలాల మండలం బషీర్‌మియాతండా, కోకట్, పాత తాండూరు, రెవెన్యూ గ్రామాల మీదుగా సుమారు 6 కిలో మీటర్లు ప్రవహించి కాగ్నా నదిలో కలుస్తుంది. తాండూరు పట్టణంలోని పాతకుంట, గొల్ల చెరువు నీరు సైతం ఈ వాగులోకి చేరుతుంది. గతంలో వాగు పక్కన ఉన్న వ్యవసాయ భూములన్నీ ప్లాట్లుగా మార్చారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో చిలుక వాగు భూమి తమదేనని కొందరు ధ్వంసం చేసి భారీ భవనాలు నిర్మించారు. దీంతో హైదరాబాద్ మార్గంలో వాగు ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి.

ఎమ్మెల్యే చొరవతో..

చిలుక వాగు ప్రక్షాళన పనులను గురువారం అధికారులు ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి వాగు అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేయించారు. హైదరాబాద్ రోడ్డు మార్గం నుంచి కబ్జాకు గురైన వాగు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. రెవెన్యూ రికార్డు ప్రకారమే చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు.



కబ్జాకు గురై ఐదు అడుగులకే పరిమితమైన చిలుక వాగు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

ధరణి దరఖాస్తులను పరిష్కరించండి

కలెక్టర్ ప్రతీక్ జైన్



దరఖాస్తులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

దుద్యాల్: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 191లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు భూమిని పరిశీలించారు. గుట్టలు ఎక్కువగా ఉండడంతో ఇక్కడ నిర్మాణాలు చేపట్టడం కుదరదని వెళ్లిపోయారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణిలో ఎలాంటి అవకతవకలకు జరగకుండా చూడాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యాలయానికి వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అప్పుడే వారికి అధికారుల పట్ల నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు ఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ దానయ్య, సర్వేయర్ దేవేందర్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల



ఎస్పీని సన్మానిస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: ఎస్పీ నారాయణరెడ్డిని గురువారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి సురేందర్, వెంకటయ్య, రవి కుమార్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మొద్గుల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సభ్యుడు బందం విశ్వేశ్వర్‌రావు అన్నారు. గురువారం ఇర్విన్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి మన తల్లి లాంటిదన్నారు. దాన్ని కాపాడుకోవడం సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేకపాలన షురూ..

ముగిసిన మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం



- మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం
- జిల్లాలో 221మంది ఎంపీటీసీలు, 18మంది జెడ్పీటీసీలు

వికారాబాద్: స్థానిక సంస్థల్లో సర్పంచుల పదవీకాలం ఇప్పటికే ముగియగా తాజాగా మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం కూడా పూర్తయ్యింది. జిల్లాలో 221మంది ఎంపీటీసీలు ఉండగా వారి పదవీకాలం ఈ నెల 3తో ముగిసింది. జెడ్పీటీసీలు 18మంది ఉండగా వారి గడువు 4వ తేదీతో ముగిసింది. స్థానిక సంస్థల్లో మున్సిపాలిటీలు తప్ప అందరి పదవీకాలం ముగిసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవడంతో మండల, జిల్లా పరిషత్‌లకు కూడా ప్రత్యేకాధికారుల నియామకం తప్పనిసరిగా మారింది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పట్నం సునీతారెడ్డి పదవీకాలం కూడా ముగిసింది. ఎంపీపీల స్థానంలో మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. గురువారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు బాధ్యతలు చేపట్టారు.

చివరి దశలో అవిశ్వాసపు మంటలు

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి గతంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా వరుసగా రెండో సారి పనిచేశారు. మొదటి సారి టీడీపీ తరఫున, రెండు, మూడు పర్యాయాల్లో బీఆర్‌ఎస్ తరఫున చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కారు పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అవిశ్వాసపు నోటీసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. జెడ్పీటీసీలు నోటీసులు ఇచ్చింది మొదలు నాలుగున్నర నెలలుగా చైర్‌పర్సన్‌కు సహకరించలేదు. దీంతో సమావేశాలను మమా అనిపించాల్సి వచ్చింది. ప్రభుత్వంలో ఉండటంతో ప్రతిపక్ష జెడ్పీటీసీలు అవిశ్వాసం నెగ్గకుండా నెట్టుకొచ్చారు. జెడ్పీలో రూ.4 కోట్ల నిధులు ఉన్నా అభివృద్ధి పనులకు ఖర్చు చేయలేకపోయారు.

నిధుల లేమితో ఇబ్బందులు

గత ప్రభుత్వ హయాంలో మండల, జిల్లా పరిషత్‌లు నిధులు లేక అల్లాడిపోయాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిధులు, సీనరేజ్ రూపంలో వచ్చే నిధులు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్దగా నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. నిధుల కేటాయింపు విషయంలో జెడ్పీటీసీల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా ఎంపీటీసీలు, ఎంపీపీలు కేవలం హోదాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో ప్రోటోకాల్ పరంగా కూడా ఎలాంటి అధికారాలు, బాధ్యతలు కూడా లేకపోవటంతో నామమాత్రంగా మారిపోయారు. స్థానిక సంస్థల ప్రతినిధిగా పనిచేసిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎంగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్‌లో మంచి రోజులు వస్తాయని పదవీకాలం ముగిసిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక అధికారులు వీరే..

మండలం పేరు	ప్రత్యేకాధికారి పేరు
వికారాబాద్	సుధీర్(జెడ్పీ సీఈఓ)
ధారూరు	మల్లేశం(డీఎస్‌సీడీఓ)
కోట్‌పల్లి	అశోక్(సీపీఓ)
మర్పల్లి	ఈశ్వరయ్య(డీసీఓ)
బంట్వారం	శంకర్‌నాయక్(డీఐఈఓ)
మోమిన్‌పేట్	సౌజన్య(డీఎఫ్ఓ ఫిషరీస్)
పరిగి	శ్రీనివాస్(డీఆర్‌డీఓ)
దోమ	హన్మంతరావు(డీవైఎస్ఓ)
కుల్కచర్ల	బాబు మోసేస్ (ఈడీ ఎస్సీ కార్పొరేషన్)
పూడూరు	జయసుధ(డీపీఓ)
కొడంగల్	జ్ఞానేశ్వర్(డీఎఫ్ఓ)
దౌల్తాబాద్	సదానందం(ఏడీ వెట్)
బొంరాస్‌పేట్	రామ్‌రెడ్డి(ఏడీ ఎస్‌ఎల్‌ఆర్)
తాండూరు	సత్తార్(డీహెచ్‌ఎస్ఓ)
పెద్దేముల్	సత్యనారాయణ(ఏడీ మైన్స్)
యాలాల్	సారంగపాని(ఏడీ మార్కెటింగ్)
బషీరాబాద్	వీరభద్రరావు(ఏడీఓ ఆడిట్)
నవాబుపేట్	గోపాల్ (డీఏఓ అగ్రి)

అడవులను కాపాడుకుందాం

- జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్

అనంతగిరి: జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో అటవీ సంపదను కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 40,48,000 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురైతే వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలన్నారు. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎఫ్ఆర్వోలు వారి పరిధిలోని అటవీ భూములకు సరిహద్దులను ఏర్పాటు చేయాలని చెప్పారు. భూముల పరిరక్షణకు అందరూ కలసికట్టుగా పని చేయాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కా బతకాలని ఇందు కోసం సరైన స్థలాలను ఎంపిక చేయాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని సూచించారు. అనంతరం అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. అటవులను కాపాడేందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్ చిత్రంలో సస్పెన్షన్‌కు గురైన అధికారులు అరుణ, శ్యామ్‌సుందర్

విధుల నుంచి తప్పించినా..

- సమావేశానికి హాజరైన ఫారెస్ట్ అధికారులు

వికారాబాద్: సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు అధికారులు యథావిధిగా జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. తూనికాకు కార్మికుల బోనస్ డబ్బులు కాజేసిన వ్యవహారంలో వికారాబాద్, తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు అరుణ, శ్యామ్‌సుందర్‌ను అటవీ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే వీరు గురువారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సస్పెన్షన్ నుంచి వారిని తప్పించేందుకు కొందరు పైరవీలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అటవీ శాఖకు చెందిన ఓ అధికారి ఈ వ్యవహారాన్ని దగ్గరుండి చూసుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరగా సస్పెన్షన్‌ను తాత్కాలికంగా ఆపాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో వారు సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా వికారాబాద్, ధారూరు ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జ్ ఆఫీసర్‌గా శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేయడానికి తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా స్థానిక నాయకులు ఆమెకు గురువారం కొత్తూరు పట్టణంలో స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఆమె పట్టణ ముఖ్య కూడలిలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేలా మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వం, బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే మరోసారి ప్రధానమంత్రిగా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికీ వ్యతిరేకత ఉందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం వాటిని అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబాయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

విసిగి వేసారి.. హతమార్చి

- ప్రాణం తీసిన కుటుంబ కలహాలు
- తల్లితో కలిసి భర్తను కొట్టి చంపిన భార్య

కందుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య తన తల్లితో కలిసి భర్తను హతమార్చింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లికి చెందిన కంచుకట్ల పరమేశ్(37) మొదటి భార్య మృతి చెందడంతో మండలంలోని కొత్తగూడకు చెందిన చుక్కమ్మ కుమారై స్వప్నను 12 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారైలు. పరమేశ్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ హైదరాబాద్ అల్మాస్‌గూడలో నివసిస్తున్నారు. కాగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో స్వప్న మూడేళ్ల క్రితం పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. పరమేశ్ తరచూ మద్యం తాగి కొత్తగూడకు వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈవిషయంలో పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీతో పెట్టడంతోపాటు పోలీసులకు సైతం స్వప్న ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మరోసారి మద్యం తాగి భార్య వద్దకు వచ్చిన పరమేశ్ ఆమెతో గొడవకు దిగాడు. దీంతో విసుగు చెందిన స్వప్న.. తన తల్లి చుక్కమ్మతో కలిసి కర్రలతో పరమేశ్‌ను కొట్టి చంపింది. మృతదేహాన్ని కొంత దూరంలోని ప్రభుత్వ పాఠశాల వెనక పక్కన ఓ వ్యవసాయ క్షేత్రంలో పడేసి వెళ్లారు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వప్న, చుక్కమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా తండ్రి మరణించడం, తల్లి, అమ్మమ్మ జైలుకు వెళ్లనుండటంతో ఇద్దరు పిల్లలు అక్షయ(7), లిఖిత(5) అనాథలయ్యారు.

ఆపరేషన్ ముస్కాన్

- తూతూమంత్రంగా ముస్కాన్, స్మైల్ కార్యక్రమాలు
- జిల్లాలో 1,800మందికి పైగా బాలకార్మికులు
- గతేడాది 65మందికి మాత్రమే విముక్తి
- తిరిగి పనుల్లోకి వెళ్తున్న చిన్నారులు
- పట్టించుకోని కార్మిక, విద్యాశాఖలు



వికారాబాద్: బడి బయటి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

వికారాబాద్: ఆపరేషన్ ముస్కాన్.. స్మైల్.. బడిబాట.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన.. విద్యాహక్కు చట్టం.. ఏదైనా బాలల హక్కులను కాపాడటం కోసమే. తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడం లేదా సంరక్షించడమే ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యం. అలాగే పనులకు వెళ్లే చిన్నారులను గుర్తించి వారిని బడిబాట పట్టించాలి. స్కూల్ మానేసిన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని తిరిగి పాఠశాల మెట్లు ఎక్కించాలి. అయితే పై కార్యక్రమాలను అధికార యంత్రాంగం అంత సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీధి బాలురు, బడి బయట పిల్లల సమాచారం సేకరించి వారిని చిల్డ్రన్ హోంకు తరలిస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపేస్తున్నారు. ఆ తర్వాత పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవడం లేదు. దీంతో చిన్నారులు మళ్లీ పనుల్లోకి వెళుతున్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చినా బాలకార్మికులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నారు. ఆరు నెలలకు ఒక్కసారి ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో 11 సార్లు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారు. 12వ విడతకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఏడాదికి రెండు సార్లు..

పిల్లలను పనుల నుంచి విముక్తి కల్పించి వారిని పాఠశాలలకు పంపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పోలీస్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, విద్య, ఆరోగ్య శాఖ చైల్డ్ లైన్ సభ్యులు ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపడతారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇది నిరంతర ప్రక్రియ.

తిరిగి పనుల్లోకి చిన్నారులు

బడిబయట పిల్లలను గుర్తించే అధికారులు వారిని పాఠశాలల్లో చేరే వరకు పర్యవేక్షించడం లేదు. పని ప్రదేశాల్లో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. బాలకార్మికులను చిల్డ్రన్ హోంకు తరలించి చేతులు దులుపుకొంటున్నారు. అక్కడి సిబ్బంది పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇళ్లకు పంపుతున్నారు. అయితే ఆ పిల్లలు పాఠశాలలకు వెళుతున్నారా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడం లేదు. దీంతో చిన్నారులు తిరిగి పనులకే వెళుతున్నట్లు తెలిసింది.

పునరావాసం కల్పించడంలో విఫలం

బాలకార్మికులను పనులు మాన్పించి బడులకు పంపేలా చూడటంలో విద్యాశాఖ, కార్మిక శాఖ అధికారుల పాత్రే కీలకం. పిల్లలను పనుల్లో పెట్టుకునే వారిపై కేసులు నమోదు చేయటం తోపాటు యజమానుల నుంచి పరిహారం వచ్చేలా కార్మిక శాఖ చూడాలి. ఇప్పటి వరకు వందల సంఖ్యలో పిల్లలకు పనుల నుంచి విముక్తి కల్పించినా ఏ ఒక్కరికీ పరిహారం అందలేదు. గత ఏడాది పోలీసులు 65 మంది చిన్నారులకు పనుల నుంచి విముక్తి కల్పించి యజమానులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో 1,800మందికి పైగా బాలకార్మికులు ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థల గణాంకాలు చెబుతున్నా.. విద్యాశాఖ వద్ద సరైన లెక్కలు లేకపోవడం గమనార్హం. బాలకార్మికులకు పునరావాసం కల్పించేందుకు జిల్లాలో నాలుగు చిల్డ్రన్ హోంలు (శిశు గృహ, బాలసదనం, యజ్ఞ ఫౌండేషన్, హెల్ప్ ఆల్ సొసైటీ) ఉన్నాయి. వీటిలో పిల్లల కోసం కేర్ టేకర్లు, వార్డెన్లు, కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక నిపుణులు, బ్రిడ్జి కోర్స్ ఇచ్చేందుకు వలంటీర్లు ఉండాలి. కానీ కేర్ టేకర్లతోనే నెట్టుకొస్తున్నారు.

క్లుప్తంగా

రికవరీ ఫోన్ల అప్పగింత

మంచాల: మండలంలో గతంలో పోయిన సెల్ ఫోన్లను మంచాల పోలీసులు రికవరీ చేసి గురువారం బాధితులకు అప్పగించారు. సీఐ బాబ్యు నాయక్ కథకం ప్రకారం.. ఠాణా పరిధిలో 35 సెల్ ఫోన్లు పోయిన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో ఎనిమిది ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. మిగతా వారివి కూడా గుర్తించి సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవినాయక్, ఏఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో గుర్తుతెలియని శవాన్ని గురువారం వెలికి తీశారు. స్థానిక ఎస్ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పెద్ద చెరువులో 55 నుంచి 60 సంవత్సరాల లోపున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. శవాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 87126 62361 సంప్రదించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానిక సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి పట్టణ శివారులోని పి.ఇంద్రారెడ్డి మినీ స్టేడియంలో రెండు గదులు ఉండగా.. ఒక దాంట్లో భీమయ్య(65) నివసిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్మికుడిగా పని చేశారు. 60 ఏళ్లు పైబడడంతో నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి తీసేశారు. దీంతో అప్పటి నుంచి పట్టణంలో కాగితాలు, దొరికిన దగ్గర భోజనం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భీమయ్య కూతురు నాలుగు క్రితం మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మద్యానికి బానిసయ్యారు. మినీ స్టేడియానికి సమీపంలో రెండు పడకల ఇళ్లలో సెక్యూరిటీగా పని చేసే సుగార్‌సింగ్, భీమయ్య నిత్యం ఉదయం వేళ టీ తాగేవారు. గురువారం మధ్యాహ్నం అవుతున్న రాకపోయే సరికి సుగార్‌సింగ్ వెళ్లి భీమయ్య గదిని పరిశీలించారు. తలుపులు తెరిచి ఉండి చేతిలో కత్తి, గొంతుపై బలమైన రక్త గాయాలతో భీమయ్య పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. చేతిలో కత్తి, గొంతుపై గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఒరుసుల మన్నెన్, అఖిల(22)లు భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహం జరిగిన వీరికి ఒక బాబు ఉన్నారు. ఇటీవల అఖిల ఇతరులతో ఫోన్ మాట్లాడుతుండడాన్ని గమనించిన మన్నెన్ గత నెల 30వ తేదీన మందలించారు. ఇది మనసులో పెట్టుకున్న అఖిల ఈ నెల 2న తన కుమారుడితో కలిసి బయటికి వెళ్లిపోయింది. వెంకటేష్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ మన్నెన్ గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సఖి సెంటర్‌కు నిండు గర్భిణి

చేవెళ్ల: మతిస్థిమితం లేని నిండు గర్భిణీ అధికారుల చొరవతో సఖి కేంద్రానికి చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొద్ది రోజుల క్రితం ఓ గుర్తుతెలియని మహిళ ఎన్కేపల్లిలో ప్రత్యక్షమైంది. ఆ మె ఎక్కడి నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో ఎవరికీ తెలియదు. ఆమె మాట్లాడే భాష కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. ఇది గమనించిన స్థానికులు విషయాన్ని అంగన్‌వాడీ టీచర్‌కు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల దృష్టికి తీసుకెళ్లారు. వారు వచ్చి వివరాలు సేకరించే ప్రయత్నం చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. సదరు మహిళ తొమ్మిది నెలల గర్భంతో ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారి నగరంలోని సఖి కేంద్రానికి ఫోన్ చేసి గర్భిణిని తీసుకెళ్లాలని కోరారు. సఖి సెంటర్ నుంచి వచ్చిన వ్యాన్‌లో మహిళను నగరానికి పంపించారు. దీంతో అధికారులు, పోలీసులపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

సర్వే కాదు.. సమస్య తీరదు

- మండలంలో సర్వేయర్ లేక రైతుల ఇబ్బందులు
- భూ సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పెండింగ్‌లో 75 దరఖాస్తులు



భూ సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

దోమ: గ్రామీణ ప్రాంత రైతులకు సర్వే కష్టాలు తప్పడం లేదు. నిత్యం కార్యాలయాల చుట్టు తిరుగుతూ భూ సర్వే కోసం నిరీక్షించాల్సి వస్తుంది. పలుమార్లు సర్వేలు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. సర్వేల కోసం తాము మీసేవలలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇన్‌చార్జి సర్వేయర్ ఉండడంతో ఎప్పుడు వస్తున్నాడో? ఎప్పుడు వెళ్తున్నాడో? తెలియని దుస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. దీంతో సర్వేకు పెట్టుకున్న దరఖాస్తులు మండలంలో రోజు రోజుకు పెరిగిపోతూ ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

రైతులు భూ సర్వేకోసం మీసేవలలో దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ అవి రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. దోమ మండల వ్యాప్తంగా పెండింగ్‌లో 75 దరఖాస్తులు ఉన్నాయి. గతంలో దోమకు సర్వేయర్ ఉన్నప్పటికి భూ సర్వే విషయంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. అప్పటి నుంచి సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉంది. అనంతరం ఇన్‌చార్జి సర్వేయర్ నియమించారు. అయితే ఆయనకు రెండు మండలాలు కావడంతో గత రెండేళ్ల నుంచి వారంలో మూడు రోజులు మాత్రమే ఇక్కడ సర్వేలు చేస్తున్నారు. దీంతో దరఖాస్తులు పెరుకుపోతున్నాయి. భూ సమస్యల కారణంగా రైతులు భూములను సర్వే చేయించుకోవాలని మీసేవలలో రూ.295 లను కట్టి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కట్టిన దరఖాస్తు రుసుం కూడా సమయం అయిపోవడంతో అధికారులు రిజక్ట్ చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, పాలకులు

రైతులు భూములు కొనాలన్నా, విక్రయించాలన్న భూ సర్వే తప్పనిసరి. సర్వే చేయకుండా భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. భూ సర్వే కోసం రైతులు చలాన్లు కట్టుకున్నప్పటికీ రోజుల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తప్పని పరిస్థితుల్లో డబ్బులు వెచ్చించి ఇతర ప్రైవేటు సర్వేయర్‌తో భూములను సర్వే చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం గతంలో లైసెన్సు సర్వేయర్ పెట్టుకోవడంతో సంవత్సరం పాటు విధులు నిర్వహించారు. అయితే వారి లైసెన్సులు రెన్యూవల్ అయిపోవడంతో వారిని ప్రభుత్వం తొలగించింది. దీంతో దోమ, పరిగి మండలాలకు కలిపి ఒక్కరే సర్వేయర్ విధులు నిర్వహిస్తుండడంతో రైతులు భూ సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

సర్వేయర్ నియమించాలి



గ్రామాలలో భూ సర్వే కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మీసేవలో దరఖాస్తులు కట్టినప్పటికి సర్వేయర్ లేక పేరుకుపోతున్నాయి. ఉన్న సర్వేయర్ వారంలో మూడుసార్లు రావడంతో దరఖాస్తు చేసుకున్న రైతులు వేచి చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత సర్వేయర్ పోస్టును భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– రాములు, మాజీ ఎంపీటీసీ, బొంపల్లి

సర్వే చేస్తున్నాం



దోమ, పరిగి మండలాలను కలిపి ఒక్కరే ఉండడంతో సర్వేలు చేయడం ఇబ్బందులు అవుతున్నాయి. దోమకి వారంలో మూడు సార్లు వచ్చి సర్వే చేస్తున్నాను. కోర్టు పనులు, ఇతర పనుల రీత్యా సర్వేలో కాస్త ఇబ్బందులు తలేత్తుతున్నాయి. త్వరలో పెండింగ్‌లో ఉన్న మొత్తం సర్వేలు పూర్తి చేస్తాం.

– హరికృష్ణ, ఇన్‌చార్జి సర్వేయర్, దోమ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



భూ సర్వే కోసం రైతులు ప్రతి రోజు తిరుగుతున్నారు. దోమకి ఇన్‌చార్జి సర్వేయర్ ఉండడంతో రైతులకు ఇబ్బందులు వస్తున్నాయి. ఆయన వారంలో మూడు సార్లు కార్యాలయానికి వస్తూ సర్వేలు నిర్వహిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. కొత్త సర్వేయర్‌ను నియమించాలని కోరుతాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు!

- ఉదన్‌రావుపల్లి కేంద్రంలో నాణ్యతలోపంతో గుడ్ల పంపిణీ
- ఆవేదన వ్యక్తం చేసిన గర్భిణులు, బాలింతలు



కుళ్లిన కోడిగుడ్లు

దోమ: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం కోసం బాలమృతం పథకం ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కోడిగుడ్లలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. గురువారం దోమ మండల కేంద్రంలోని ఉదన్‌రావుపల్లి అనుబంధ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్ లబ్ధిదారులకు గుడ్లను పంపిణీ చేశారు. ఇంటికి తీసుకెళ్లి వాటర్‌లో గుడ్లను వేసి చూడగా అవి పైకి తేలడం గమనించారు. పగులగొట్టి చూడగా దుర్వాసన వ్యాపించింది. అవి కుళ్లిపోయి ఉన్నట్లు గుర్తించారు. వాటిని ఫొటోలు, వీడియోలు తీసి అంగన్వాడీ టీచర్‌కు చూపించగా పైనుంచి ఇలానే వచ్చాయని సమాధానం చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలు నాణ్యమైన గుడ్లను సరఫరా చేయకపోవడంతోనే మండిపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు లబ్ధిదారులకు అందించే గుడ్లలో నాణ్యమైనవి అందించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు కోరుతున్నారు.

పాముకాటుకు మహిళా రైతు మృతి

పూడూరు: పాముకాటుకు గురైన ఓ మహిళా రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేడిపల్లికలాన్ గ్రామానికి చెందిన చన్‌వెల్లి చంద్రమ్మ(73) ఈ నెల 2న పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. గమనించిన కుటుంబీకులు వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ గురువారం అక్కడ మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు చెయడంతో కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతానికి ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

దుద్యాల్: విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెగడ్డలో గురువారం రాత్రి చోటు చేసుకొంది. బాధిత రైతు ముకుంద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60 వేలకు పైగానే ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువు తూముకు లీకేజీ



పాడైన ఆలేడ్ చెరువు తూము

దుద్యాల్: మండలంలోని ఆలేడ్ గ్రామంలో ఉన్న చెరువు తూము లీకు కావడంతో నీరు వృథాగా పోతుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం పూర్తి స్థాయి నీటిమట్టం నిండుకుంది. చెరువు తూము లీకేజీ కావడంతో ప్రస్తుతం నీరు వృథాగా పోతుంది. తూము నుంచి నీ రు బయటకు పోకుండా ఉపయోగించే ఇనుప రాడ్డు పూర్తిగా లోపలికి పడపోవడంతో లీకు అవుతుంది. దీంతో చెరువులో ఉన్న నీరు పొలాలకు కాకుండా వృథాగా మారింది. చెరువు కింద సాగయ్యే పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందకుండానే చెరువులో నీరు ఖాళీ అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తూమును మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లు రవి

ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: మండలంలో వివిధ అభివద్ధి పనులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి గురువారం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు అప్పారెడ్డిపల్లిలో కుర్మ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి వీడ్కోలు కార్యక్రమంలో ఇరువురూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలు అందించిన ప్రజా ప్రతినిధులకు గౌరవం ఉంటుందన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. నియోజకవర్గంలో వంద ఎక రాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తునన్నట్లు వెల్లడించారు.విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అనంతరం పద వీ కాలం ముగియనున్న నేపథ్యంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిని నాయకులు ఘనంగా సత్కారించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..తమపదవీకాలంలో మా డ్గుల అభివృద్ధే లక్ష్యంగా పని చేశా మన్నారు.కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పా ర్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శీనివాస్‌రెడ్డి, నాయకులు సంపత్, దళపతి, రమేష్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం ప్రయాణికులకు కొత్త చట్టాలపై, సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం నేరం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. గుర్తు తెలియని, కొత్త వ్యక్తులు మీ వద్దకు వచ్చి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేమ్‌లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లితండ్రుల పట్ల గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నబంధనలను పాటించి వాహనాలను నడపాలన్నారు. ఎక్కడ దొంగతనాలు జరిగినా, కొత్తగా అపరిచిత వ్యక్తులు కనిపించినా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భూపాల్‌రెడ్డి, సుష్మ, శ్రీనివాస్, దస్తయ్య, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు

చేవెళ్ల: లోక్‌సభలో రాహుల్‌గాంధీ హిందూవుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరైనది కాదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా చేవెళ్లలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అయన మా ట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎప్పుడు హిందూవులకు వ్యతిరేకంగా, దేశ సంస్కృతిని అవహేళన చేసే విధంగా ఉంటుందని విమర్శించారు. ఈ దేశంలోని హిందూవులంతా కాంగ్రెస్ వైఖరిని గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికై నా కాంగ్రెస్ వైఖరి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, అడ్డెట్ల శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్, వెంకట్రామిరెడ్డి, దేవుని శర్వలింగం, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, రాజు, చందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, చాకలి శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేల తల్లి కరుణించేలా..

- నేడు మట్టి ఎద్దుల అమావాస్య
- ప్రత్యేక పూజలకు రైతన్న సిద్ధం



రెబ్బాన్ పల్లిలో అమ్మకానికి సిద్ధంగా మట్టి ఎద్దులు

దుద్యాల్: మట్టి ఎద్దులకు పూజలు చేస్తే నేలతల్లి కరుణిస్తుందని రైతుల నమ్మకం. అమావాస్య రోజు పండుగ జరుపుకొంటే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, నష్టాలు లేకుండా ధాన్యలక్ష్మి ఇంటికి చేరుతుందని విశ్వాసం. ఇలా చేస్తే పశుసంపద వృద్ధి చెందుతుందని, మూగజీవాలకు రోగాలు దరిచేరవని కర్షకులు భావిస్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మట్టి ఎద్దుల అమావాస్యను ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

పండుగ ప్రత్యేకత...

ఏరువాక పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్యనే మట్టి ఎద్దుల అమావాస్యగా జరుపుకొంటారు. వానలు కురవడం, విత్తు వేసుకునే తరుణంలో ఈ తరుణం వస్తుంది. అమావాస్య తిథి రోజు మట్టితో చేసిన జోడెద్దులను ఇంట్లో కొలువుంచి చూడ ముచ్చటగా అలంకరిస్తారు. పిండి వంటలు చేసుకుని నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు చేస్తారు. కొందరు. ఎద్దుల గాటిపాల్లకు సున్నాలు వేసి మట్టి ఎద్దులను అందులో కొలువుంచి పూజిస్తారు. సాయంకాలం వేళ కొందరు ప్రత్యేక వాహనాలపైన పెట్టి, మరికొందరు చేతుల్లో పట్టుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగిస్తూ గ్రామ దేవతలకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తారు. ఆయా గ్రామాల్లోని బసవేశ్వర ఆలయం లేదా శివాలయానికి చేరుకుని మట్టి ఎద్దులను మంజునాథుడి ముందు పెట్టి మొక్కు తీర్చుకుంటారు. అనంతరం ప్రతిమలను ఇళ్లకు తీసుకెళ్లి ఏడాదంతా దేవుడి గదిలో పెట్టి పూజిస్తారు. ఇందనూర్, చంద్రకల్, కస్తూరిపల్లి తదితర గ్రామాల్లో ఈ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

కొడంగల్ రూరల్: దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను పురస్కరించుకొని ఆర్ఎస్‌యూ (రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఇప్పటికే 65 పర్యాయాలు పేపర్ లీకేజీలు అయ్యాయన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆక్షేపించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నీట్ పరీక్షను మళ్లీ నిర్వహిస్తూ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలు, జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్, ఉపాధ్యక్షులు అశోక్, శేఖర్, శ్రీకాంత్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి



కొడంగల్: చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి



బొంరాస్‌పేట: కిష్టప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి
- బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. లక్ష్మీపల్లి, రుద్రారం గ్రామాల్లో బ్రిడ్జి, రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం కొడంగల్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 205 మందికి రూ.1.39 కోట్ల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యా వైద్యం రవాణా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, నాయకులు నయీం, ఆసిఫ్‌ఖాన్, రాంరెడ్డి, భాస్కర్, బస్వరాజ్, దాము తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట: నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని జానకంపల్లి–మహంతీపూర్ బీటీ రోడ్డు, వంతెన నిర్మాణం పనులకు కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలోని జానకంపల్లి నుంచి మహంతీపూర్ మీదుగా యాలాల మండలం దేవనూరుకు రూ.23 కోట్ల నిధులతో బీటీరోడ్డు, కాగ్నావాగుపై వంతెన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మండలంలోని 86 కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సింలుగౌడ్, శేఖర్ నాయకులు రాజేశ్‌రెడ్డి, రాంచంద్రరెడ్డి, నర్సిములునాయు డు, మల్లేశ్, దేశ్యానాయక్, సంతోష్, కాశప్ప, రాములు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాజకీయ పరంగా తమలో ఒకరిగా అభిమానాన్ని చాటుకుంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తల పట్ల ఆత్మీయతను చాటుకుంటామని తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కుమ్మరి కిష్టప్ప పితృవియోగం పట్ల కుటుంబాన్ని తిరుపతిరెడ్డి పరామర్శించారు. అలాగే దుప్‌చర్లలో చనిపోయిన పార్టీ దళితనాయకుడు నాగప్ప కుటుంబాన్ని తిరుపతిరెడ్డి ఓదార్చారు.

27 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి నగరానికి తరలిస్తుండగా పోలీసుల స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: ఒడిశా నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో కొంతమంది అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు కారు లోపలి భాగంలో సోదాలు చేయగా 36 ప్యాకెట్లతో ఉన్న సుమారు 27 కిలోల గంజాయి బయటపడింది. కారులో ఉన్న వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం నుంచి నగరానికి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించడంతో బలరాం తాళి(23), రాజు కపస్య(20), విజయ హాల్దార్(22)లతోపాటు కారు యజమాని కొడుకు మైనర్(13)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గంజాయితో పాటు ఓ కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి